సాక్షి
ప్రకాశం
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



అభయారణ్యంలో ఆహ్లాదం
గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లే దారిలో వన విహారి పనులు పూర్తయ్యాయి. రూ.2 కోట్లతో పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. - 8లో..



సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా లభిస్తుందని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30.6/23.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు అండర్ 17 షూటింగ్ బాల్ సెలక్షన్స్

ఒంగోలు: అండర్ 17 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి షూటింగ్ బాల్ బాల బాలికల క్రీడాజట్ల ఎంపిక ఈనెల 19న సంత నూతలపాడు మండలం పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ ఎంపిక జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పీఈటీ/పీడీలు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్‌లైన్ ఎంట్రీ చేయించి మాన్యువల్ ఎంట్రీఫారంలతో వచ్చి ఎంపికలో పాల్గొనాలని కోరారు. 17 సంవత్సరాల కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబరు, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించి పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు యం.రత్నకుమార్, సెల్: 7730004438 ను సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారిణి ఎంపిక


వై.భూమినర్తన

ఒంగోలు: జాతీయ స్థాయిలో జరిగే ఫెన్సింగ్ పోటీలకు ఒంగోలు కేంద్రీయ విద్యాలయానికి చెందిన వై.భూమినర్తన ఎంపికైంది. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఫాయిల్ విభాగంలో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకుంది. దీంతో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని మెహసానలోని సర్దార్ పటేల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే 18వ క్యాడెట్ (అండర్ 17) నేషనల్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి జి.నవీన్, కోచ్‌లు భరత్, విజయలక్ష్మి, రాజులను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు అభినందించారు.

సూరారెడ్డిపాలెం ఆయిల్ డిపోను కొనసాగిస్తున్నాం

ఒంగోలు: సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న ఆయిల్ డిపోను కొనసాగిస్తున్నామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయుశాఖల సహాయక మంత్రి రమేష్ తేలి సమాధానం ఇచ్చారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆయిల్ డిపో మూసివేతకు ప్రభుత్వ ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో దాని ద్వారా జిల్లాలో వేలమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తున్నందున దానిని కొనసాగించాలంటూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించారు. దీనిపై తాజాగా కేంద్రమంత్రి రాతపూర్వకంగా ఎంపీకి సమాధానం పంపారు. ఆయిల్ డిపోల స్థాపన లేక మూసివేత అనేది ఆర్థిక సాధ్యత, భద్రతా ఆందోళనలు, నిర్దిష్ట ప్రాంతాలు, చట్టబద్ధమైన నిబంధనలు నెరవేర్చడం వంటి వివిధ కారకాలపై ఆధారపడి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చేసే వాణిజ్య నిర్ణయమన్నారు. సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న ఆయిల్ డిపోలను కొనసాగించాల్సిందిగా ఏపీ పెట్రోలియం టాంక్ ట్రక్ ఆపరేటర్ల అసోసియేషన్ కోరిందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపిందన్నారు. దేశంలో ఆయిల్ డిపోలను మూసివేసే ప్రతిపాదన ఏమీలేదని, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తెలిపాయన్నారు. ప్రకాశం జిల్లాలో సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న ఆయిల్ డిపోను కూడా మూసివేసే ప్రతిపాదన లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత పెట్రోలియం కార్పొరేషన్లు తెలిపినట్లు కేంద్రమంత్రి రమేష్ తెలిపారు.

దివ్యాంగులకు డిజిటల్ విద్య

విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు కూడా మెరుగైన వసతులు కల్పిస్తోంది. వారు కూడా ఆధునిక విద్యా విధానాలను అందిపుచ్చుకునేలా డిజిటల్ విద్యను చేరువ చేస్తోంది. అందులో భాగంగా విద్యార్థులకు, వారికి బోధించే ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.35 వేల విలువ చేసే ఈ ట్యాబ్‌లలో దివ్యాంగుల విద్యాభ్యసనకు అవసరమైన యాప్‌లు పొందుపరిచారు. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు వినియోగించకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు.


దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జిల్లా అధికారులు(ఫైల్)

ట్యాబ్‌ల పంపిణీ ఇలా...

జిల్లాలో భవిత కేంద్రాలు	38
నమోదైన చిన్నారులు	800
ఇంటి వద్దనే ఐఈఆర్‌టీల ద్వారా శిక్షణ పొందుతున్న వారు	380 మంది
ట్యాబ్‌లు పంపిణీ చేసిన విద్యార్థులు	296
ఐఈఆర్‌టీలకు ఇచ్చిన ట్యాబ్‌లు	75
స్కూల్ అసిస్టెంట్లకు (ప్రత్యేక బీఈడీ టీచర్లు)	43
హెచ్.ఐ (7-10 తరగతుల విద్యార్థులకు)	155
వీ.ఐ (5-10 తరగతుల విద్యార్థులకు)	36

- జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ
- ప్రత్యేక యాప్‌లతో డిజిటల్ విద్య
- ట్యాబ్‌ల వినియోగంపై సమగ్ర శిక్షణ
- దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కనిగిరి రూరల్: విద్యా రంగంలో వినూత్న మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ చదువుల కోసం ప్రత్యేక ట్యాబ్‌లను పంపిణీ చేశారు. తదనుగుణంగా దివ్యాంగులకు డిజిట్ విద్యను చేరువ చేసేందుకు నడుంబిగించారు. తాజాగా భవిత కేంద్రాల్లో (ప్రత్యేక అవసరాలున్న పిల్లల వనరుల కేంద్రం) ఎస్‌ఏపీ 2020లో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు అత్యాధునిక ట్యాబ్‌లను అందజేస్తున్నారు. (వీ.ఐ) దృష్టి లోపం, నోవిజన్ (పూర్తి గుడ్డి), శ్రవణ లోపం (చెవుడు) (హెచ్.ఐ) ఉన్న విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేస్తున్నారు. దివ్యాంగ విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన నూతన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను (5 రకాల వస్తువులతో) పంపిణీ చేస్తున్నారు. ఇందు కోసం ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ (ఐఈఆర్‌టీ), దివ్యాంగుల తల్లిదండ్రులకూ ట్యాబ్‌లపై ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పించనున్నారు. 29 రకాల యాప్‌ల ద్వారా అభ్యాసన స్థాయిలో నూతన సాంకేతికతతో డిజిటల్ విద్యను ప్రభుత్వం అందించనుంది.


దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ఐఈఆర్‌టీలు

ఆధునిక సాంకేతికతతో..

దృష్టి, మూగ, చెవుడు కలిగిన విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన యాప్‌లు ఉన్న ట్యాబ్‌లు ఇచ్చారు. అంధులు, పాక్షిక అంధులు, బధిరులు, పాక్షిక బధిరులకు వీలుగా టాక్ బ్యాక్ (ట్యాబ్‌ను ఏవైపు ఉపయోగించినా స్పందించే యాప్), స్పోకెన్ అసిస్టెంట్ (శబ్ద సంకేతాల ద్వారా ట్యాబ్‌ను వినియోగించే యాప్), విజిబులిటీ ఇన్‌ఎన్స్‌మెంట్ (దృష్టి లోపం ఉన్న వారికి చిన్న చిన్న విషయాలను స్పష్టంగా చూపడానికి ఉపయోగించే యాప్), మిషన్ ఏఐ, ఎన్ విజన్ యాప్‌లు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే యాప్), వంటి పలు యాప్‌లను ట్యాబ్‌లో పొందుపర్చారు. రోజుకు ఎన్నిగంటలు ట్యాబ్ వాడుతున్నారనే దానిపై, దాన్ని ఎలా వినియోగిస్తున్నారనే దాన్ని పూర్తిగా గమనించేలా ఐఈఆర్‌టీలకు, ప్రత్యేక టీచర్స్‌లకు అనుసంధానం చేసిన ఉంచినట్లు తెలిసింది. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు వినియోగించకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ..

ప్రత్యేక అవసరాలున్న బాలబాలికలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీని జిల్లా అధికారుల చేతులమీదుగా ప్రారంభించారు. ఈమేరకు క్షేత్ర స్థాయిలో మండల కేంద్రాల్లో ఎంఈఓల చేత పంపిణీ చేయించారు.

దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత



భవిత కేంద్రాల్లో విద్యార్థులకు సుమారు రూ.30 నుంచి రూ.35 వేల విలువ చేసే ట్యాబ్‌లను ప్రభుత్వం అందిస్తోంది. వారికి సులభతరంగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక యాప్‌లను అందులో ఉంచారు. ట్యాబ్‌ల ద్వారా దివ్యాంగులు ఆధునిక సాంకేతికతను అలవర్చుకుంటారు. దీంతో దివ్యాంగులకు ప్రభుత్వం డిజిటల్ విద్యను మరింత చేరువ చేస్తోంది. ఈ నెలాఖరులో ప్రత్యేక బీఈడీ టీచర్లకు, రిసోర్స్ పర్సన్‌లకు జిల్లా కేంద్రంలో శిక్షణ ఇస్తారు.
– రమేష్, ఐఈఆర్టీ జిల్లా కోఆర్డినేటర్

38 భవిత కేంద్రాల్లో ...

జిల్లాలో 38 భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో సుమారు 800 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. వీరిలో సుమారు 380 మంది వరకు ఇంటి వద్దనే ఉంటూ ఐఈఆర్‌టీల ద్వారా ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. వీరిలో దృష్టిలోపం, నోవిజన్, మూగ, చెవుడు కలిగిన ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సుమారు 296, ఐఈఆర్‌టీలు 75, స్కూల్ అసిస్టెంట్‌లకు (స్పెషల్ బీఈడీ చేసిన ఉపాధ్యాయులు) 43 ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఒక్కో ట్యాబ్ విలువ సుమారు రూ.30 నుంచి రూ.35 వేల వరకు ఉంటుంది.

పలు రూట్లలో ఆర్టీసీ గిఫ్ట్‌బాక్స్ స్కీమ్ అమలు

ఒంగోలు: ప్రయాణికులకు ప్రోత్సాహాన్ని కల్పించేందుకు పలు రూట్లలో గిఫ్ట్‌బాక్స్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లు ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొందూరు, తాళ్లూరు, గుండాయపాలెం, కొణిజేడు రూట్లలో ఈ స్కీమ్ అమలు చేస్తున్నామన్నారు. ఆయా రూట్లలో ప్రయాణించిన వారు బస్సు దిగి వెళ్లేటపుడు తమ టికెట్ వెనుక తమ పేరు, మొబైల్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలన్నారు.

ప్రతి నెలలో 15 రోజులకు ఒకసారి బాక్సు ఓపెన్ చేసి లాటరీ ద్వారా ప్రతి రూట్ నుంచి ఒకరు చొప్పున విజేతలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ వారిచే ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారన్నారు. కనుక ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ వాహనాలలో ప్రయాణించి, గిఫ్ట్‌లను అందుకుని ఆర్టీసీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రూప్ 2, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు: గ్రూప్ 2, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు లాజిక్ అకాడమీ డైరెక్టర్ పాలపర్తి విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ ఇప్పటికే వివిధ విభాగాల్లో 900కుపైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, కేంద్ర ప్రభుత్వం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ వివిధ విభాగాల్లో 24678 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగ యువతకు వరం అన్నారు.

స్థానిక అంజయ్యరోడ్డులోని తమ అకాడమీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థినీ విద్యార్థులకు 75 రోజులపాటు గ్రూప్ 2, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అందివచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 23లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9985839758 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దర్శిలో జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన

దర్శి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన జనవరి 10, 11 తేదీల్లో దర్శి పట్టణంలోని తమ నివాసం వద్ద నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

స్థానిక బూచేపల్లి నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎడ్లపందేల గోడపోస్టర్లను వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఎడ్లపందేలు నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం ఒంగోలు జాతి ఎడ్లకు మంచి పేరు ఉందని, అయితే ఒంగోలు ప్రాంతంలో మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అందుకే జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనను సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరవుతారని చెప్పారు.

న్యూ కేటగిరీ, సీనియర్ కేటగిరీ అనే రెండు కేటగిరీల్లో పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యూ కేటగిరీ ఎడ్లకు 16 క్వింటాళ్ల బండ, సీనియర్ విభాగం ఎడ్లకు 21 క్వింటాళ్ల బండ లాగుతారన్నారు. రెండు కేటగిరీలకు 9 బహుమతులు అందిస్తున్నామని చెప్పారు. న్యూ కేటగిరీ బహుమతులు వరుసగా రూ.లక్ష, రూ.80 వేలు, రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు ప్రకటించారు. అలాగే సీనియర్ విభాగం ఎడ్లకు బహుమతులు వరుసగా రూ.2 లక్షలు, రూ.1.60 లక్షలు, రూ.1.25 లక్షలు, రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలుగా ప్రకటించారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఎడ్లజతకు కన్సోలేషన్ బహుమతిగా రూ.7 వేలు అందిస్తున్నట్లు తెలిపారు.

పోటీల్లో పాల్గొన దలిచిన వారు సందిరెడ్డి నరేంద్రరెడ్డి 9966368684, రాజు క్రియేటివ్స్ 9160427437, 9985130929, 6304506020, 9381869924 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎంబాషా, దర్శి ఎంపీపీ సుధాఅచ్చయ్య, వైస్ ఎంపీపీ సోముదుర్గారెడ్డి, కురిచేడు, ముండ్లమూరు జెడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, టీ రత్నరాజు, సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి చెన్నారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ ఎంపీపీలు వీరగంధం కోటయ్య, ఇత్తడి దేవదానం, పోతం మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, ఆవుల శివారెడ్డి, దొనకొండ, ముండ్లమూరు మాజీ మండల కన్వీనర్లు కాకర్ల కృష్ణారెడ్డి, సూదిదేవర అంజయ్య, దర్శి మాజీ సర్పంచ్ చంద్రగిరి గురవారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


గోడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- మంత్రి ఆదిమూలపు సురేష్

మార్కాపురం: ఏసు క్రీస్తు చూపిన మార్గం, ఆయన చేసిన బోధనలు అనుసరణీయమని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మార్కాపురం సమీపంలో డాక్టర్ సామ్యూల్‌జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో కలిసి మంత్రి సురేష్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ క్రీస్తు బోధించిన శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కుల, మతాలకు అతీతంగా క్రీస్తు బోధనలు పాటిస్తే సమాజంలో సుఖ సంతోషాలుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ తోటివారిపట్ల దయ, కరుణ, ప్రేమ చూపాలన్నారు. ఉత్సాహంగా సాగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ప్రిన్సిపల్ రాజబాబు, డీన్ మస్తానయ్య, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణలను మంత్రి సురేష్ సన్మానించారు.


మంత్రి సురేష్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పక్కన మున్సిపల్ చైర్మన్

అయోధ్య రామమందిరం అక్షతలకు నగరోత్సవం


అయోధ్య రామమందిరం కోటి అక్షతలను ఊరేగిస్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: అయోధ్య రామమందిరం నుంచి మార్కాపురానికి వచ్చిన కోటి అక్షతలకు విశ్వహిందూ పరిషత్ భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం నుంచి పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షతలు, కంకణం, లాకెట్, రామ మందిర నిర్మాణ ఫొటోలను నగరోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని నాలుగు మాడవీధుల్లో కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా రామమందిరం ప్రతినిధి యక్కలి రావు మాట్లాడుతూ అయోధ్య మందిరం ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణంలోని వివిధ ఆలయాలకు అక్షతలను పంపిణీ చేసి ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో భక్తులందరికీ, ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నీలో ఏపీ జట్ల విజయకేతనం



విజేతలతో కోచ్, మేనేజర్లు

దొనకొండ: 67వ జాతీయ క్రీడల్లో భాగంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఢిల్లీలో నిర్వహిస్తున్న అండర్-14 హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ బాలురు, బాలికల జట్లు ఆదివారం జరిగిన ఆటలో విజయం సాధించారు. బాలుర విభాగంలో విద్యా భారత్ జట్టుపై 9-15తో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ఐపీఎస్‌సీ పై 1-25గా 24 గోల్స్ తేడాతో, విద్యా భారత్‌పై 2-10గా 8 గోల్స్ తేడాతో గెలుపొంది ప్రీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించినట్లు కోచ్ ఎల్ దుర్గారావు, మేనేజర్లు కాలే నరసింహారావు, ఎస్ మయూరి తెలిపారు.



రూ.3.88 కోట్లతో జెడ్పీ పాఠశాల అభివృద్ధి



జిల్లాలో పెద్దదైన మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం ద్వారా ఇప్పటి వరకూ ఫేజ్ 1, ఫేజ్ 2లో రూ.3.88 కోట్లు ఖర్చుపెట్టి విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాం. ఫేజ్ 1లో రూ.1.45 కోట్లు మంజూరుకాగా వాటితో టాయిలెట్స్, తరగతి గదుల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, తరగతుల్లో విద్యుదీకరణ, విద్యార్థులకు బెంచీలు, బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేశాం. రెండో ఫేజ్‌లో రూ.2.40 కోట్లు మంజూరు కాగా వీటి కోసం 20 అదనపు తరగతి గదులు కట్టాలని నిర్ణయించాం. ఇప్పటికే రూ.90 లక్షలు విడుదలయ్యాయి. మొత్తం 18 తరగతి గదుల నిర్మాణం ప్రారంభించగా 14 తరగతి గదులు శ్లాబ్‌లు పూర్తికాగా 4 తరగతి గదులకు శ్లాబులు వేయాల్సి ఉంది. గడచిన నాలుగేళ్ల నుంచి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం 1300 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకుంటున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో జగనన్న విద్యా కానుకలు కూడా అందించాం.
– మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం, జెడ్పీ బాయ్స్ హైస్కూల్, మార్కాపురం.

గడప గడపకు వచ్చినవారు లేరు



గతంలో ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే వారు కానీ.. ఆ తరువాత వచ్చే వారు కాదు నాయకులు. కానీ ముఖ్యమంత్రి జగనన్న అయిన తరువాత మంత్రులను ప్రజల వద్దకు పంపుతున్నారు. మా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. నిజంగా జగనన్న సెల్యూట్ చేయాల్సిందే. ఈ ప్రభుత్వంలో పథకాల ద్వారా మా కుటుంబం రూ.5 లక్షలు లబ్ధిపొందింది. చాలా సంతోషం. జగనన్నకు రుణపడి ఉంటాం.
– దేవికాబాయ్, సుద్దకురవ తండా

వృత్తిలో స్థిరపడడానికి ప్రభుత్వం అండగా నిలిచింది



లా నేస్తం వలన నేను ఎంతగానో ప్రయోజనం పొందుతున్నాను. లా చదివి నా లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలి అనుకున్న దానికి అనుగుణంగా 2018-21 సంవత్సరంలో వైఎస్ఆర్ కడప జిల్లా కేంద్రంలో బసవతారక లా కళాశాలలో లా పట్టా పొందాను. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం 2022 మార్చి నుంచి ప్రతినెలా రూ.5 వేల చొప్పున లా నేస్తం పథకం ద్వారా నా అకౌంట్‌లో నగదు జమ చేస్తోంది. లా పట్టా పుచ్చుకున్న వెంటనే ప్రాక్టీస్ జరగనప్పటికీ ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.5 వేల నగదు నాకు ఎంతో ఆసరాగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.
– ఎం.రవికుమార్, రాజుపాలెం, కొమరోలు మండలం

ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాయి



నాడు-నేడుతో దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారాయి. నాడు విద్యార్థులు కూర్చోవడానికి గదులు సరిపడలేదు. చెట్ల కింద కూర్చోబెట్టి పాఠాలు బోధించేవారు. నేడు అలాంటి సమస్య లేకుండా అదనపు తరగతి గదులు నిర్మించారు. పాఠశాలల్లోనే బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కల్పించారు. నాడు సుమారు 400 మంది విద్యార్థులు ఉండేవారు. నేడు 1050 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగు పడ్డాయి. విద్యా రంగాన్ని గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. నేడు ముఖ్యమంత్రి జగనన్న పాఠశాల రూపురేఖలు మార్చేశారు. తల్లిదండ్రులు సంతోషంగా తమ పిల్లలను పాఠశాలకు పంపుతున్నారు.
– వీవీ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు, దొనకొండ

క్లుప్తంగా

డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి ఉత్తమ న్యాక్ అవార్డు



ఉత్తమ న్యాక్ అవార్డు అందుకుంటున్న డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి లభించిన ఉత్తమ న్యాక్ అవార్డును కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అందుకున్నారు. ఏపీ ఉన్నతవిద్య ఆధ్వర్యంలో అనంతపురం ప్రభుత్వ కాలేజీలో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి వార్షికోత్సవంలో ఈ అవార్డును ఉన్నత విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఉత్తమ ఐక్యు ఏసీ కో ఆర్డినేటర్ పి.కుసుమకుమారికి ప్రత్యేక అవార్డు లభించింది. మెరిట్ విద్యార్థులైన టి.రూపాసాయి బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో, గుర్రం రమ్య బీఎస్సీ ఎంపీపీఎస్‌లో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో, కుమారి తస్లీమ్ ఆక్వా కల్చర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

పర్చూరు (చినగంజాం): రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అడుసుమల్లిలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కారుమంచి ప్రసాద్ (70) ఆదివారం రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. ప్రమాదంలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై రవిశంకర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చీరాల వైద్యశాలకు తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. ఆర్టీసీ బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అభయారణ్యంలో ఆహ్లాదం

అభయారణ్యంలో ఆహ్లాదం అందించేందుకు వనవిహారి సిద్ధమవుతోంది. గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లే ప్రధానరోడ్డును ఆనుకుని ప్రతి ఒక్కరి మనస్సును ఆకట్టుకునేలా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న అందాలను అస్వాదించేందుకు, అడవిలో సేదతీరాలనుకునే ప్రకృతి ప్రియులకు ఈ వనవిహారి మంచి విడిది ప్రాంతంగా మారనుంది. సుమారు రూ.2 కోట్లతో సుందరంగా తయారైన ఈ విడిది ప్రాంతాన్ని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.



అద్భుతంగా నిర్మించిన ఉడ్ కాటేజీ గదులు

- ఉల్లాస విడిది కేంద్రంగా వనవిహారి
- రూ. 2 కోట్లతో వనవిహారి పనులు
- పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో వనవిహారి పనులు పూర్తయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఈ ప్రాజెక్టుపై టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రద్ధ పెట్టకపోవడంతో పనులు మరుగునపడ్డాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ఊపందుకున్నాయి. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ వనవిహారిలో ఏర్పాట్లు చేశారు. ప్రకృతి ప్రియులకు విడిది కేంద్రంగా ప్రభుత్వ ప్రోత్సాహంతో మండలంలోని దిగువమెట్ట గ్రామంలో వనవిహారి రూపుదిద్దుకుంటుంది. ఇప్పటికే పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి ముందే వనవిహారిలోని అందాలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విద్యార్థులు భారీగా తరలిస్తున్నారు.

ఆహ్లాదకర వాతావరణం..

ఈ వనవిహారిలో ఆహ్లాదకర వాతావరణం కట్టిపడేస్తుంది. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. అభయారణ్యంలో సంచరించే పులులు చిత్రపటాలను కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. ప్రాచీన సంప్రదాయకమైన ఆచార వ్యవహార శైలీ విధానాలను ప్రతిబింబించేలా ప్రత్యేక చిత్రాలను ఏర్పాటు చేశారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న అందచందాలను అస్వాదించి సేదతీరే ప్రకృతి ప్రియులకు వనవిహారి ఒక వరంగా మారిందనే చెప్పవచ్చు. గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లే ప్రధానరోడ్డును ఆనుకుని ఉన్న వనవిహారి ప్రతి ఒక్కరి మనస్సును ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అటుగా వెళ్లే ప్రతి ఒక్కరూ ఒక్క సారైనా వనవిహారిలో అడుగుపెట్టాల్సిందే అన్న విధంగా నిర్మించారు.



వనవిహారి ముందుభాగంలో ఏర్పాటు చేసిన ముఖద్వారం

వనవిహారిలో ప్రత్యేకతలు..

ఇక్కడ ఉడ్ కాటేజీలు రెండు, టెంట్ కాటేజీలు రెండు మొత్తం నాలుగు కాటేజీలను నిర్మించారు. నాలుగు కాటేజీల్లో ఏసీలు, ఫ్యాన్లు, మంచాలు ఏర్పాటు చేశారు. అతిథులు విడిది చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. కాటేజీలు కావాలనుకునే వారికి ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకునేలా అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వనవిహారిలో విడిది చేసిన వారికి నల్లమల అందాలు చూపించేందుకు జంగిల్ సవారీ కోసం ప్రతిపాదనలు తయారు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ ప్రత్యేక గార్డెన్, చిల్డ్రన్స్ పార్కు, అడ్వెంచర్ పార్కులు నిర్మించారు. వనవిహారిలో కాఫీ షాపు ఏర్పాటు చేసి అందులో అటవీప్రాంతంలో లభించే తేనే, ఉసిరి, త్రిఫల చూర్ణం, వంటి ఇతర వస్తువులను సరసమైన ధరలకు విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నారు. అతిత్వరలోనే అన్ని వసతులతో కూడిన వనవిహారి ప్రారంభానికి సిద్ధమవుతోంది.



వనవిహారిలో చక్కగా తీర్చిదిద్దిన పులుల చిత్రాలు



ప్రాచీన సాంస్కృతిని తలపించే చిత్రం



చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆటవస్తువులు

డాక్టర్ ఓబయ్యకు నీసా సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



డాక్టర్ ఓబయ్యకు అవార్డు అందజేస్తున్న అమ్రిత్ అభిజాత్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని వి.బైలు గ్రామానికి చెందిన డాక్టర్ జమకాల ఓబయ్యకు నీసా సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు–2023 లభించింది. ఈమేరకు లక్నోలోని సిఎస్ఐఆర్ – నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమి (నీసా) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో శనివారం ఆయన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి అమ్రిత్ అభిజాత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ ఏటా పర్యావరణ పరిరక్షణకు కృషిచేసిన అధ్యాపకులను గుర్తించి అవార్డులను ప్రధానం చేస్తుంటుంది. ఈ క్రమంలో జమకాల ఓబయ్యను 2023లో నీసా సైంటిస్ట్ ఆఫ్‌ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాపొందిన డాక్టర్ జమకాల ఓబయ్య గతంలో కూడా పలు అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వర కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఓబయ్యకు అవార్డు లభించడంపై పలువురు గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

వివాహిత ఫొటోలు మార్ఫింగ్

- ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి వేధిస్తున్న యువకుడు
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

జరుగుమల్లి: డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు తన ఇంటి సమీపంలో నివసించే వివాహిత ఫొటోలను అశ్లీలంగా మార్ఫి, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి వేధిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగుచేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదివారం జరుగుమల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఓ శుభకార్యానికి హాజరైన వివాహితను అదే గ్రామానికి చెందిన యువకుడు తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. వాటిని అశ్లీలంగా మార్ఫింగ్ చేయడమే కాకుండా, సదరు మహిళ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచి అప్‌లోడ్ చేశాడు. ఆ ఫొటోల దిగువన వివాహిత మొబైల్ నంబర్ జత చేశాడు. దీంతో నెల రోజులుగా ఆమెకు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు అధికంగా వస్తున్నాయి. కాల్ చేసిన వారు అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో మానసికంగా కుంగిపోయింది. రోజులు గడుస్తున్నా ఫోన్ కాల్స్ పరంపర కొనసాగుతుండటంతో విషయాన్ని ఆమె తన బంధువులకు తెలియజేసింది. వారు గ్రామంలో విచారించి నిందితుడిని నిర్ధారించుకున్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేసిన యువకుడితోపాటు అతనికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని జరుగుమల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జరుగుమల్లి ఎస్సై వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ఉలవపాడు: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వీరేపల్లి రైల్వే గేటు సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..దిగువకు వెళ్లే లైను 243వ నంబర్ వద్ద మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతుడు ఒంటిపై తెలుపురంగు చొక్కా, కాలర్‌పై గుడ్‌విల్ అను లేబుల్ ఉందని, నలుపురంగు లోయర్ ఫ్యాంటు ధరించి ఉన్నట్లు ఒంగోలు రైల్వే పోలీసులు తెలిపారు. మృతునికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు 9440627646 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

వెలిగండ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదల కుటుంబాల్లో ఆర్థికభరోసా నింపుతున్నాయని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని ఇమ్మడిచెరువు సచివాలయ పరిధిలోని మోటుపల్లి, పాపాయిపల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా నవరత్న పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని, ప్రభుత్వ అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ వారికి బుక్ లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు రాకుంటే తమ దృష్టికి తేవాలని కోరారు. గ్రామానికి చెందిన కొందరు నివేశనా స్థలాలు మంజూరు చేయించాలని కోరగా దరఖాస్తు చేసుకోవాలని త్వరితగతిన మంజూరు చేయిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచడం సాహసోపేతమని, పేదల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చారనేదానికి ఇది నిదర్శనమన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ, కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలు కేవలం టీడీపీ నాయకులు, కార్యకర్తలకే వచ్చేవని, జన్మభూమి కమిటీల పేరుతో నాటి ప్రభుత్వం దోచుకో దాచుకో చందాన పనిచేసిందన్నారు. ప్రతి పథకాన్ని పేదల సంక్షేమమే ధ్యేయంగా పారదర్శకంగా అమలు చేసి పేదలకు అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తూ ఆదర్శముఖ్యమంత్రిగా నిలిచారని ఎమ్మెల్యే బుర్రా అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జగనన్న లేవుట్‌లు వేసి అందరికీ సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత కూడా ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో మహిళలు ఎమ్మెల్యేకు అడుగడుగునా హారతులు, పూలతో స్వాగతం పలకగా అక్కా చెల్లెమ్మల ఆనందం కోసం మీ సేవకునిగా పనిచేసి రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు వెంకట గురవయ్య, సర్పంచ్ గాలి తిరుపతిరెడ్డి, ఆరెకటిక రాష్ట్ర చైర్మన్ దాదాకుమారి లక్ష్మి, ముదిరాజ్ రాష్ట్ర సభ్యులు కె.పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు వై.నాగూర్‌యాదవ్, కె.వెంకట్రామయ్య, టి.నాని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రొయ్యల రైతుల సంఘ కమిటీ ఎన్నిక

ఒంగోలు సెంట్రల్: జిల్లా రొయ్య రైతుల సంఘ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలు ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం రొయ్యల రైతుల ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. రొయ్య రైతుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఐవీఆర్ మోహన్ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్‌రాజు సమక్షంలో ఎన్నిక జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షుడిగా చేపల రమణయ్య, సంఘ జిల్లా అధ్యక్షునిగా దుగ్గినేని గోపీనాథ్, ప్రధాన కార్యదర్శిగా కె. సుబ్బారెడ్డి, ట్రెజరర్‌గా మద్దినేని ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా శింగంనేని అంజిబాబు, నార్నే రమేష్‌బాబు, పమిడి సుబ్బానాయుడు, సహాయ కార్యదర్శులుగా యూఎస్ రాజు, చేపల శ్రీను, షేక్ సలాం, కమిటీ కార్యవర్గసభ్యులుగా చేపల శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు. రొయ్యల రైతులకు ఏ సమస్య ఎదురైనా కమిటీ బాధ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని జాతీయ అధ్యక్షుడు ఐవీఆర్ మోహన్‌రావు కోరారు. అవకాశం కల్పించినందుకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు చెప్పారు. చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాపు ఉపాధ్యాయుల ఆశయం అందరికీ ఆదర్శం



మాట్లాడుతున్న ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి

ఒంగోలు: కాపు పేద విద్యార్థులకు అండగా నిలిచి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు రావడంపై కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి అభినందనీయమని ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి అన్నారు. స్థానిక ఎంహెచ్‌ఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన ఏపీ కత్వా 9వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను నేడు ఈ స్థానంలో నిలుచోగలిగానంటే అందుకు సింగరాజు వెంకట్రావు కృషే కారణమన్నారు. ఆయన కృషిని మెచ్చి కాపులకు పెద్ద పీట వేసిన పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. సింగరాజు వెంకట్రావుకు దక్కాల్సిన ఒడా చైర్మన్ పదవి మహిళా కోటాలో తనకు లభించిందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లోను కాపులకు అత్యంత ప్రోత్సాహాన్ని కల్పించిన వ్యక్తి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అని, వారి వల్లే తాను రెండోమారు కూడా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో 206 మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులను కత్వా వ్యవస్థాపక అధ్యక్షుడు ఫణీంద్ర కుమార్, జిల్లా అధ్యక్షుడు చోడిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాపు నాయకులు అందించారు. ఈచ్ వన్ క్యాచ్ వన్ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు లేని విద్యార్థులను, పేద, ప్రతిభ కలిగిన 100 మంది విద్యార్థులను 8వ తరగతి మొదలు పీజీ వరకు వారికి చదువుకయ్యే పూర్తి ఖర్చులను ఎన్ఆర్ఐ, ఏపీటీఏ ద్వారా దత్తత ఇచ్చి వారి చదువు పూర్తయ్యేంత వరకు ఆ బాధ్యతను వాళ్లు తీసుకునేలా ఏపీ కత్వా తీసుకుంటున్నట్లు కత్వా నాయకులు ప్రకటించారు. కాపు టీచర్లకు వెన్నుదన్నుగా నిలబడే బాధ్యత తనదని కాపునాడు కన్వీనర్ ఆమంచి స్వాములు పేర్కొన్నారు. కత్వా అసోసియేషన్‌కు పూర్తిగా అండగా ఉంటామని కాపు నాయకులు మంత్రి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కత్వా పూర్వ అధ్యక్షుడు ప్రతాప్, జంపని కృష్ణకుమార్‌లు అభినందనలు తెలిపారు. కత్వా నూతన అధ్యక్షులుగా బీసాబత్తిన శ్రీనివాసరావు, కార్యదర్శిగా తూము శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా పోలిశెట్టి గంగాధర్‌లు ఎంపికయ్యారు. వీరికి రాష్ట్ర వ్యవస్థాపకులు కొల్లా నారాయణ, పేరూరి ఫణీంద్రకుమార్ అభినందనలు తెలిపారు.

మార్కాపురం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి





ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ నాయకులు, హాజరైన ఐటీ ఉద్యోగులు

- జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం
- హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా, సీఏ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రాష్ట్రంతో పాటు మార్కాపురం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని అందుకు ఐటీ, ఫార్మా, సీఏ ఉద్యోగుల సహకారం అవసరమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉన్న శ్రీరస్తు ఫంక్షన్‌హాలులో మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి హైదరాబాద్‌లో స్థిరపడిన ఐటీ, ఫార్మా, సీఏ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ గత పాలకులంతా మార్కాపురం అభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేశారన్నారు. దశాబ్దాల కాలంగా పరిష్కారం కానీ మార్కాపురం, పొదిలి పట్టణాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ నిధులు మంజూరు చేశారన్నారు. టీటీడీ కల్యాణ మండపాన్ని కూడా పూర్తి చేశారన్నారు. మార్కాపురం ప్రజల కోరిక మేరకు బీసీ, అంబేడ్కర్ భవన్‌ను మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంటుతో వేలాది మంది చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారని, అంతకుమించి ముఖ్యమంత్రి జగనన్న వసతి, విద్యా దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఐటీ, ఫార్మా ఉద్యోగులు తమవంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ ఆలీబేగ్ మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో మార్కాపురం నియోజకవర్గాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అన్నీ విధాలా అభివృద్ధి చేశారన్నారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మార్కాపురం నియోజకవర్గాన్ని జిల్లాలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. టీడీపీ హయాంలో ఉన్న నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారన్నారు. ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ మేడా బద్రీనాథ్ మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో యుగాల చరిత్ర కలిగిన చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధి కోసం సుమారు రూ.12 కోట్లతో ఎమ్మెల్యే దాతల సహకారంతో నిర్మిస్తున్నారని, పట్టణంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మరోసారి నాగార్జునరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు పోశంరెడ్డి సునీల్ రెడ్డి, స్టేట్ కో ఆర్డినేటర్ రోశిరెడ్డి సింగారెడ్డి, జనరల్ సెక్రటరీ హరీష్‌రెడ్డి తదితరులు మాట్లాడి తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. సుమారు 500 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని ఘనంగా సన్మానించారు.